వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 365 బుధవారం | 04 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# సీఎంతో కలిసే అవకాశం కల్పించాలి

కలెక్టర్‌కు కళాకారుల వినతి

2లో



# నేలకొరిగిన మావోయిస్టు అగ్రనేత..

ఎన్ కౌంటర్‌లో మాచర్ల ఏసోబు మృతి

8 లో..



8లో

# నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

పోలీసుల అదుపులో ఎనిమిది మంది

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాం నాయక్



2లో

# తరం మారతున్నది.. ఆ స్వరం మారుతున్నది

మారతున్న 'మైబాద్'



8లో..

# రైళ్ల రాకపోకలు షురూ..

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

వివరాలు 2లో..



# రెడ్డీస్ క్లబ్



క్లబ్ కహానీ.. 4

వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో పెత్తనమంతా వాళ్లదే

పంచుకుంటున్న పదవులు

విభజించు..పాలించు ఇదే ఇక్కడ అమలు

బ్రిటిష్ ఫార్ములాను అనుసరిస్తున్న పాలకవర్గం

బడుగు, బలహీన వర్గాలకు చోటామోటా పదవులే..



వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో 'రెడ్ల 'హవా నడుస్తోంది. క్లబ్ ఏర్పడిన నాటినుంచి నేటి వరకు అగ్రకులాల పెత్తనం నిరంతరాయంగా కొనసాగుతోంది. రెడ్లంతా ఏకమై క్లబ్‌లో 'దావత్' సంస్కృతిని కొనసాగిస్తున్నారు. 'దావత్' పెట్టు పదవులు పట్టు అన్నట్లుగా పాలక వర్గాల ఎంపిక సాగుతోంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుగాల్సి ఉన్నప్పటికీ నీకీ పదవి.. నాకీ పదవి అంటూ పుట్నాలు, బెల్లం లాగా పదవులను పంచుకుంటున్నారు. విభజించు.. పాలించు అనే బ్రిటిష్ ఫార్ములాను తూచా తప్పకుండా పాటిస్తున్నారు. రెడ్లకు వ్యతిరేకంగా ఎవరైనా పోటీ చేసేందుకు ముందుకు వస్తే వారికున్న పలుకుబడితో వారిలో వారికే భేదాభిప్రాయాలు సృష్టించి వారి పని పూర్తి చేసుకుంటున్నారు. పాలకవర్గానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా బడుగు, బలహీన వర్గాల సభ్యులకు చోటోమోటా పదవులిస్తూ వారిని అక్కడికే పరిమితం చేస్తున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే క్లబ్‌లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు, సంపన్న వర్గాలకు చెందిన వారంతా ఒక్కటై కనీసం కార్యవర్గ సభ్యుడిగా కూడా గెలువకుండా పాతాళంలో పాతరేస్తున్నారు. అతడి నామ రూపాలే క్లబ్‌లో కనిపించకుండా చేస్తున్నారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

# ‘రెడ్డీస్’ క్లబ్

**వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో పెత్తనమంతా వాళ్లదే**

**పంచుకుంటున్న పదవులు**

**విభజించు.. పాలించు ఇదే ఇక్కడ అమలు**

**బ్రిటిష్ ఫార్ములాను అనుసరిస్తున్న పాలకవర్గం**

**బడుగు, బలహీన వర్గాలకు చోటామోటా పదవులే..**

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ లో ‘రెడ్ల’ పెత్తనం నడుస్తోంది. ఇక్కడ వారు విభజించు..పాలించు అనే బ్రిటిష్ ఫార్ములాను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన క్లబ్ సభ్యులను వారి అవసరాలకు అనుగుణంగా విభజించి పబ్బం గడుపుకుంటున్నారు. ఎదుటి పక్షంలో వర్గాలు, భేదాభిప్రాయాలు సృష్టించి వారికున్న పలుకుబడితో అనుకున్న విధంగా పని పూర్తి చేసుకుంటున్నారు. కాదని ఎవరైనా వ్యవహరిస్తే వారికి క్లబ్ లో సభ్యత్వం కూడా లేకుండా చేస్తున్నారు. ఇలా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వరంగల్ క్లబ్ ను పూర్తిగా ‘రెడ్డీస్’ క్లబ్ గా మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారు.







## ‘దావత్’ సంస్కృతి..

క్లబ్ లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు, సంపన్న రెడ్లు అంతా ఒక్కటై.. ఒక్క‘దావత్’తోనే పాలకవర్గాన్ని నిర్ణయిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ దానికి మంగళం పాడి రెడ్ల రాజ్యం కొనసాగిస్తున్నారు. సంపన్నులతో సన్నిహితంగా ఉన్న బడుగు, బలహీన వర్గాలకు చోటామోటా పదవులు కట్టబెడుతూ వారి నోళ్లను మూయిస్తున్నారు. వీరి అడుగుజాడల్లో నడవకుండా ప్రశ్నిస్తే.. కనీసం ఈసీ మెంబర్ కూడా గెలువకుండా పాతాలానికి తొక్కడం క్లబ్ లో ఆనవాయితీగా మారింది. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. గతంలో వీరి వ్యవహారాలను దిక్కరించిన లయన్ నాగేశ్వరరావు, ప్రముఖ ఈఎన్టీ డాక్టర్ రమేష్ కుమార్ ను రెడ్లంతా ఒక్కటై ఓడించారు. ఇదే తరహాలో.. జిల్లాలో ఉన్న అన్ని ప్రజా సంఘాలలో రెడ్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం కేశిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి (మల్కాపూర్) సుదీర్ఘకాలం ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీగా సేవలందించారు. ఆ తర్వాత పెసరు శ్రీనివాస్ రెడ్డి (మల్లారెడ్డి పల్లె) కొంతకాలం డాక్టర్ క్రాంతి రావు (ఉన్నత కులస్తుడు) పనిచేశారు. పొద్దుటూరి నారాయణ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రెడ్డి, ఈద ప్రేమ్ సాగర్ రెడ్డి, దొంతు రవీందర్ రెడ్డి (ఆర్ ఆర్) వరుసగా క్లబ్ కార్యదర్శులుగా ఎన్నికై విధులు నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 24 నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన మాదిరెడ్డి రవీందర్ రెడ్డి క్లబ్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. క్లబ్ ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఓడినా అగ్రకుల వర్గ సంబంధాలు మాత్రం ఒక్కటే. సీనియర్ కార్యదర్శులు క్లబ్ నిబంధనలు పాటించి అభివృద్ధి సంక్షేమానికి పాల్పడగా, గత మూడు కమిటీలు మాత్రం అక్రమాలకు కేరాఫ్ గా నిలిచాయి.

## క్లబ్‌లో హైడ్రామా..

వరంగల్ క్లబ్ లో హైడ్రామా నడుస్తోంది. సభ్యత్వాల విషయాలపై జరుగుతున్నదంతా ఓ డ్రామా తప్ప.. క్లబ్ సంక్షేమం కోసం ఏమాత్రం కాదు. గతంలో ఓట్లు పొందిన సభ్యులను క్లబ్ కు చెక్కుల రూపంలో డబ్బు చెల్లించలేదన్న కారణంతో వారికి నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక పాలకవర్గం పోతే.. మరో పాలకవర్గం వస్తుందన్న సోయి లేదా? అని ప్రస్తుత కమిటీని నిలదీశారు. ఐడి కార్డులు, రసీదులు పొందిన సభ్యులను తొలగిస్తామంటే.. గత ఆరేళ్లుగా పనిచేసిన కార్యదర్శులు, కమిటీ సభ్యులంతా తప్పు చేశారా అని వారు ప్రశ్నించారు. గత రెండు ఎన్నికల్లో తాము ఓట్లు వేశామని, ప్రస్తుత కమిటీ కూడా తమ ఓట్లతోనే గెలిచి పాలన సాగిస్తోందని వారు తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన అసలు దోషులను వదిలి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండి పడుతున్నారు. అవినీతి అక్రమాలపై విచారణ జరుపకుండా క్లబ్ లో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న ప్రస్తుత కమిటీ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అకారణంగా తమ సభ్యత్వాలను రద్దు చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని 154 మంది సభ్యులు హెచ్చరించారు. క్లబ్ సభ్యులు తిరగబడితే ఏమవుతుందో వ్యవస్థలో జరుగుతున్న సంఘటనలను చూసి నేర్చుకోవాలని వారు హితవు పలికారు. ప్రస్తుత పాలకవర్గం నిజాయితీతో పని చేయాలని వారు కోరారు. క్లబ్ లో 1,390 మంది సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయాలని వారు సూచించారు. క్లబ్ ఎన్నికల్లో రెండు సార్లు ఓట్లు వేసిన తమ సభ్యత్వం చెల్లనప్పుడు మా ఓట్లతో గెలిచిన ప్రస్తుత కమిటీ రిజైన్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఐక్యత లేదు..

క్లబ్ లో విభిన్న వర్గాలవారు ఉన్నప్పటికీ బడుగు, బలహీన వర్గాల్లో ఐక్యత లేకపోవడం ఉన్నత వర్గాల వారికి కలిసొస్తుంది. వారి చెప్పు చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్నారు. ఇకనైనా వరంగల్ క్లబ్ లో రెడ్ల పెత్తనాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ వారంతా ఒక్కటూ కావాలి. వరంగల్ క్లబ్ అంటే కేవలం రెడ్లదే కాదు అందరిదీ అని చాటి చెప్పేలా కృషి చేయాలి.

# తరం మారుతున్నది.. ఆ స్వరం మారుతున్నది

## మారుతున్న ‘మైబాద్’

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఏమోయ్.. ఇవాళ కలెక్టర్ ఆఫీస్ లో పనుంది ‘మైబాద్’ పోయి వస్తా.. ట్రైను మైబాద్ దాకా వచ్చిందట.. మైబాద్ నుంచి మా చుట్టాలు వస్తున్నారు... భూమి రిజిస్ట్రేషన్ ఉంది మైబాద్ పోతున్న.. కోర్టు పనికి మైబాద్ పోతున్న... మా నాన్నకు బాలేదు మైబాద్ తీసుకుపోతున్న.. సీఎం రేవంత్ రెడ్డి మైబాద్ వస్తుండు... ఇలా జిల్లా కేంద్రం మానుకోట మహబూబాబాద్ పలుకు ఇప్పుడు మైబాద్ గా మారుతుంది. ఇలానే గతంలో ఉన్న ఓరుగల్లు







వరంగల్ గా ఖమ్మం మెట్టు ఖామెట్ అ తర్వాత ఖమ్మం గా మరిపెడ బంగ్లా మరిపెడగా దోర్నాల్ డోర్నకల్ గా బొగ్గుట ఇలందుగా మారిపోయాయి. గతంలో గ్రామాల పలుకులు తరం మారుతున్న కొద్దీ వాటి స్వరం కూడా మారిపోతుంది. రాబోయే తరం మహబూబాబాద్ కేవలం ‘మైబాద్’ గా పిలుస్తారనే అభిప్రాయం వ్యక్తమౌతుంది.

## హిస్ట్రీ రిపీట్..

2016 అక్టోబరు 11 న చేసిన కేంద్రం నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ముందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహబూబాబాద్ డివిజన్ కేంద్రంగా ఉండేది. మానుకోట తెలుగులో ‘మ్రాను’ అంటే ‘చెట్టు’, ‘కోట’ అంటే ‘కట్టడం’ గా అర్థం. ఆంగ్లంలో ఇది ‘చెట్లతో చేసిన కోట’ అని అనువదిస్తుంది. పూర్వపు రోజుల్లో మానుకోట మొత్తం చెట్లతో పుష్కలంగా ఉండేది. అందుకే ఈ ప్రాంతాన్ని మానుకోట అని పిలుస్తారు. నిజాం పాలకుడు ‘మహబూబ్ అలీ ఖాన్’ నగరాన్ని సందర్శించినప్పుడు, మానుకోటను మహబూబాబాద్ గా మార్పు చేసినట్లు తెలుస్తోంది. నిజాం అధికారులలో ఒకరైన మహబుబ్. అతను ఒకసారి స్వతంత్రానికి ముందు మనుకోటకు వచ్చి ఈ పట్టణం లోని ‘షికారా?నా’ అని పిలువబడే ప్రదేశంలో ఉన్నాడు. ఆ కారణంగా మహబూబాబాద్ అని పిలుస్తూ ఉండడంతో కాలం గడిచేకొద్దీ మానుకోట పేరు మహబూబాబాద్ గా మార్చబడింది. మహబూబాబాద్ జిల్లాలో పెద్ద పట్టణం, మైదాన ప్రాంతానికి చెందిన నగరం. ఎన్నో విద్యాసంస్థలు, సూపర్ స్పెషాలిటి సదుపాయాలు ఆసుపత్రిలు ఉన్నాయి. శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గ కేంద్రస్థానం. రాబోయే రోజులలో మహబూబాబాద్ కానుమరుగై ‘మైబాద్’ లా మారిపోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సీఎంతో కలిసే అవకాశం కల్పించాలి

## కలెక్టర్‌కు కళాకారుల వినతి

**వరంగల్ వాయిస్, మనుమకొండ :** కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి ఈ నెల 9న వస్తున్న ముఖ్యమంత్రితో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కళాకారులు కలిసి వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లే అవకాశాన్ని కల్పించాలని కోరుతూ పలువురు కళాకారులు బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను కలిసి విజ్ఞప్తి చేశారు. కళాకారుల భవనం ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భంగా కళాకారుల సమస్యలను వేదిక మీదనే విన్నవించుకోవడంతోపాటు సీఎంకు వినతి పత్రాన్ని ఇచ్చే సమయాన్ని కల్పించాలని కోరారు. వరంగల్ పోచంమైదాన్ లో మధ్యంతరంగా నిలిచిపోయిన కల్చరల్ కాంప్లెక్స్ ను పూర్తి చేయాలని, చారిత్రాత్మక కాకతీయ కళోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహించాలని, సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల సంఖ్య పెంచి అర్హులైన కళాకారులకు స్థానం కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల మాదిరిగా కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. కళాకారుల జీవన భృతికి సమాచార పౌర సంబంధాల శాఖ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమాలపై కళాకారులకు నెలకు 15 రోజుల ప్రోగ్రాములు ఇచ్చి ఆదుకోవాలన్నారు. నూతనంగా ప్రారంభిస్తున్న కాళోజీ కళాక్షేత్రం సాంస్కృతిక సంస్థలకు సంవత్సరంలో ఒక రోజు ఫ్రీగా ఇవ్వాలని వృద్ధ కళాకారులకు ఆసరా పెన్షన్లు కాకుండా ప్రత్యేక పింఛన్లు ఇవ్వాలని ఇండ్లు లేని నిరుపేద కళాకారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందించడానికి జిల్లా కలెక్టర్ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సకల కళ సాంస్కృతిక మండలి అధ్యక్షులు గడ్డం సుధాకర్, కవి గాయకులు పాలాటి రాజు, అంకుస్, రాజు, గబ్బెట కృష్ణ, తదితర బృందం పాల్గొన్నారు.

# చికెన్ గున్యాతో జాగ్రత్త

## అపెక్స్ హాస్పిటల్ డాక్టర్ విఘ్నేష్



**వరంగల్ వాయిస్, పరకాల :** హాస్పిటల్స్ కు ప్రతిరోజు చికెన్ గున్య వ్యాధితో బాధపడుతూ వచ్చే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని అపెక్స్ హాస్పిటల్ డా. విఘ్నేష్ (రూమటాలజిస్ట్) అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీనికి కారణం ఆడ ఏడిస్ దోమ కాటు ద్వారా చికెన్ గున్య వైరల్ వ్యాధి సంక్రమిస్తుందని, డెంగీ వైరస్ ను వ్యాప్తి చేసే దోమలే ఈ చికెన్ గున్యాను వ్యాపింపజేస్తాయని, ఈ దోమలు తక్కువ ఎత్తులోనే ఎగురుతూ, పగటి పూట మాత్రమే కూడుతాయి. ఈ దోమ కుట్టినప్పుడు ఎటువంటి నొప్పి కలుగదు, కాబట్టి, మనకు కుట్టినట్టు తెలియదని, వ్యాధి బారిన పడ్డ వారికి జ్వరం, కీళ్ల నొప్పులు వాపులు, దద్దుర్లు, వికారం వాంతులు అవడం లాంటి లక్షణాలు ఉంటాయని, ఈ వ్యాధి చాలా వరకు 15 నుంచి 20 రోజులలో వ్యాధి పూర్తిగా నయమవుతుంది. 30 శాతం మందిలో 3నెలల వరకు నొప్పులు ఉంటాయి. ఇందులో కేవలం 10శాతం మందికి కీళ్లవాతంగా (రుమాటైడ్ ఆర్థరైటీస్) మారే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధికీ నిర్దిష్ట మందు లేదు కానీ వ్యాధి లక్షణాలను బాధను డాక్టర్ గారి సమక్షంలో తీసుకున్న మందుల ద్వారా తగ్గించుకోవచ్చు. ఈ వ్యాధికీ ప్రాణపాయం అరుదు, భయపడాల్సిన అవసరం లేదు. చికెన్ గున్యాను నివారించడానికి ఉత్తమ మార్గం దోమ కాటును నివారించడమే, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం పొడవాటి దుస్తులు ధరించడం, దోమ తెరలు వాడడం, ఓడమస్ వంటి మస్కిటో రిపెలెంట్ వంటివి వాడి దోమకాటుకు దూరంగా ఉండడం మంచిదని, చికెన్ గున్యాతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మండల పరిధిలోని కామారెడ్డిపల్లి, అలియాబాద్ గ్రామాల్లోని పాఠశాలలో పోలింగ్ కేంద్రాల వసతులను పరిశీలించి సంబంధిత ప్రధానోపాధ్యాయులతో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అలాగే కామారెడ్డి పల్లి గ్రామ పంచాయతీ లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామస్తులుకు నిర్వహించిన పరీక్షలు వారికి ఇస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ సూపర్ వైజర్ నాగరాజు శర్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, ఆశాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపల్ పరిధిలోని మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి తండ్రి నల్లెల్ల రాజయ్య దశ దిన కర్మ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నల్లెల్ల రాజయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింతిరెడ్డి సాంబరెడ్డి, పర్నెం తిరుపతి రెడ్డి, బొజ్జం రమేష్, ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, డాక్టర్ మడికొండ శ్రీను, బొచ్చు భాస్కర్, మంద సురేష్, మేకల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ బస్టాండ్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

## ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

## ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్న వరంగల్ బస్టాండ్ ను ఆధునీకరించే పేరుతో కూల్చివేసి నెలలు నడుస్తున్నా నిర్మాణం చేపట్టకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని, తక్షణమే ప్రయాణికుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించి బస్టాండ్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ బస్టాండ్, తాత్కాలిక బస్టాండ్లను సందర్శించి ప్రయాణికుల ఇబ్బందులను తెలుసుకొని బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సుంచు జగదీశ్వర్ మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అత్యంత కీలకమైన వరంగల్ బస్టాండ్ నుంచి రోజు వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తారని, వందలాది గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచి మార్కెట్ కు సరుకుల అమ్మకాలు, కొనుగోళ్లకు, విద్యా, వైద్యం ఇతర అవసరాలకు అలాగే రైల్వే స్టేషన్ కు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారని తెలిపారు. అలాంటి వారికి పాత బస్టాండ్ లో వర్షం వస్తే తడవకుండా ఉండేదని కానీ, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని, తాత్కాలిక బస్టాండ్ లో కనీస సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బస్టాండ్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా కుంటి సాకులతో బస్టాండ్ నిర్మాణాన్ని ఆధునీకరించకుండా వదిలివేశారని, ఈ ప్రభుత్వం సైతం అదే దారిలో పయనిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రయాణికుల అందరికీ అందుబాటులోకి బస్టాండ్ తీసుకొచ్చే విధంగా పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు ఐతమ్ నాగేష్, నలివెల రవి, శ్రీలత, వేణుమాధవ్, రాజేందర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## ఏబీవీపీ నర్సంపేట పట్టణ కార్యదర్శి రాకం రాకేష్




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా నర్సంపేట ఆధ్వర్యంలో పట్టణంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నర్సంపేట పట్టణ కార్యదర్శి రాకం రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అలాగే, రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రి ఎవరో రేవంత్ రెడ్డి చెప్పాలని, ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా, ఇప్పటివరకు రాష్ట్రంలో మద్యం శాఖకు మంత్రి ఉన్నాడు కానీ విద్యా శాఖకు మంత్రి లేడని మండిపడ్డారు. ఎన్నికల ముందు విద్యార్థులకు, రాష్ట్ర ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి విద్యార్థులు ఓట్లు దండుకొని రేవంత్ రెడ్డి గద్దెను ఎక్కారన్నారు. రాష్ట్రంలో రూ.7000 కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ లో ఉన్నాయన్నారు. విద్యార్థుల అకౌంట్ లో ఒక్క రూపాయి వేసిన పాపన పోలేదన్నారు. ఎప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుద్ధి తెచ్చుకొని వెంటనే విద్యా శాఖ మంత్రిని నియమించి పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఉదయ్, అరుణ్, వెంకటేష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కుమారస్వామి గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బయ్యాగోని కుమారస్వామి గౌడ్ ను నియమిస్తూ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో ఉన్న గౌడ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నటువంటి సేవలను గుర్తించి బయ్యాగోని కుమారస్వామి గౌడ్ ను తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బయ్యాగోని కుమారస్వామి గౌడ్ మాట్లాడుతూ గౌడ కుల అభివృద్ధికి, తెలంగాణ గౌడ సంఘం ఆశయాలకు, లక్ష్యాలకు, సంక్షేమం కోసం, గౌడులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినందుకు గాను రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారగోని కుమారస్వామి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, కోటగిరి శ్రీనివాస్ గౌడ్, బూర శ్రీధర్ గౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, కొడకండ్ల :** మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొడకండ్ల మండలానికి 81 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.81లక్ష 9 వేల 396 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపడతామని, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ నినాదమని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని రాష్ట్ర ప్రభుత్వం నిరూపిస్తున్నదని వెల్లడించారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని అన్నారు.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడ లేని విధంగా 2లక్షల రూపాయలలోపు రైతు రుణ మాఫీ జరిగిందని తెలిపారు. తెలంగాణలో 31 వేల కోట్ల రైతు రుణమాఫీ దేశచరిత్రలోనే రికార్డు అని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రం కూడా ఇంతవరకు ఇన్ని వేల కోట్ల రూపాయలకు రైతుల కోసం కేటాయించలేదన్నారు. ఇది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. భారీ వర్షాలకు పంట నష్టం వాటిల్లిన రైతులకు త్వరలోనే వ్యవసాయ అధికారులతో విచారణ జరిపించి, పంట నష్ట పరిహారం చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను చేపడుతూ అర్హులందరికీ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి



**వరంగల్ వాయిస్, రఘునాథ్ పల్లి :** మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెరగకపోవడంతో విద్యార్థులు అర్ధాకలి, అరకొర సదుపాయాలతో కాలం వెల్లదీస్తున్నారని, పెంచిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక చార్జీలు పెంచాలని, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పొదల లవ కుమార్, గర్ల్స్ కన్వీనర్ దాసగాని సుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలలు సందర్శించి ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను విద్యార్థి నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలపై పాలకులు సవతి తల్లి ప్రేమ చూపుతోందని మండిపడ్డారు. విద్యార్థులకు మెడికల్ క్యాంపులు నిర్వహించడం లేదని, పూర్తిగా విద్యార్థుల సంక్షేమం మరచి అధికారులు, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని హెచ్చరించారు.

అదేవిధంగా స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న క్రీడా ప్రాంగణంలో గడ్డి మందు కొట్టించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న మూత్రశాలలు పునరుద్ధరించాలన్నారు. లేకుంటే మండలంలోని ఎంఈఓ ఆఫీస్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంశీ, తేజ, ఆర్య తదితరులు పాల్గొన్నారు

## హనుమకొండ భిక్షపతికి గద్దర్ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కవి గాయకులు, రచయిత, హనుమకొండ మ్యూజిక్ అధినేత హనుమకొండ భిక్షపతి గద్దర్ అవార్డు గ్రహీతగా ఎంపికయ్యారు. తొర్రూరు పట్టణంలో ప్రజా గాయకుడు గిద్దె రాంనర్సయ్య చేపట్టిన గిద్దె గళం ఆధ్వర్యంలో గద్దర్ అన్న అవార్డు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీం, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు సింగంరెడ్డి పృథ్వీ రాజ్, దరువు అంజన్న, శంభూకుని అవార్డు గ్రహీత శరత్ చమార్, తాళ్ల సునీల్, యోచన జూపాక శివ చేతుల మీదుగా గద్దర్ అవార్డును భిక్షపతి అందుకున్నాడు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ నిజంగా గద్దర్ అవార్డు తీసుకోవడం చాలా సంతోషకరమని, గద్దర్ ఆశయాలను తన భావాజాలాన్ని తన పాటలను మోసుకొని పల్లె పల్లెలో ప్రజల్లో చైతన్యాన్ని నింపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్యాల నరేష్, డప్పు శ్రీకాంత్, రాజేందర్, ప్యాడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎఫ్పీ ప్రోగ్రాం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి రైతు వేదికలో ఎస్-ఎస్ఎఫ్ పీ ప్రోగ్రాంలో భాగంగా పరకాల ప్రాజెక్ట్ సీడీపీఓ స్వాతి పాల్గొని మైక్రో ప్లాన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలోని ఎస్ఐఎం, ఎంఏఎన్, యూ డబ్ల్యూ పిల్లలను గుర్తించి హెల్త్ సెంటర్లకు పంపించడం జరుగుతుందని, బాలామృతం అంగన్వాడీ సెంటర్లు ఇవ్వడం జరుగుతుంది. పోషక మాసం సందర్భంగా అంగన్వాడీ సిబ్బందితో ప్రతిన చేయించారు. ఈ కార్యక్రమానికి పరకాల ప్రాజెక్టు సీడీపీఓ స్వాతి, రాయపర్తి పీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ స్వాతి, డిస్టిక్ అధికారులు, హెల్త్ సూపర్వైజర్స్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత, పుణ్యవతి, శ్రీదేవి, రోజా రాణి, ఏఎన్ఎం ఆశాలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఉత్తమ గురువులకు సత్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాలుగు దశాబ్దాల క్రితం విద్యా బోధన చేసి తమ ఉన్నతికి కారకులైన ఇరువురు గురువులను అపూర్వంగా సత్కరించుకున్న వేడుక బుధవారం ఆవిష్కృతమైంది. వరంగల్ ఏకశిలా కమ్యూనిటీ హాల్ ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. జనగామ జిల్లా జఫర్ గడ్ మండలం కూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982-83 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు సంఘటితమై ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. అప్పుడు తమకు ఆంగ్ల బోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు తిరునగరి నర్సింహస్వామి, తెలుగు బాషా బోధన చేసిన పొడి శెట్టి శ్రీనివాస్ చార్యులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అలనాటి తీపి గుర్తులను మననం చేసుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా పరమేశ్వర్, వేణుగోపాల్, జ్యోతి, శంకర్ తదితరులు వ్యవహరించారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా తిరునగరి పద్మ



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నేరేడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నతిరునగరి పద్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. ఇందుకు గాను, రేపు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ చేత కలెక్టరేట్ లో ఆమెను ఘనంగా సన్మానించడం జరుగుతుంది.

## సీపీఎస్‌ను రద్దు చేయండి

### యూనియన్ జిల్లా నేత జయప్రకాష్ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ ను (సీపీఎస్) రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను (ఓపీఎస్) అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్ టీయూసీ) జోగుళాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ స్కీమ్ ను పునరుద్దరించాల్సిన ప్రభుత్వం కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేయకుండా యునైటెడ్ పెన్షన్ స్కీమ్ ను (యూపీసీ) తీసుకొని రావడం పట్ల ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం వలన ఉద్యోగ విరమణ తరువాత ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. సీపీఎస్, యూపీఎస్ విధానాలను అమలు చేయకుండా, పాత పెన్షన్ స్కీమ్ నే తిరిగి పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ డిమాండ్ చేశారు.

# పడకేసిన పారిశుధ్యం

### పట్టించుకోని ప్రత్యేకాధికారులు



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** మండలంలోని సన్నూరు గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కానీ ప్రత్యేక అధికారులకు సమస్యలు చెప్పినా వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. సన్నూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు బురదమయమై నడవలేని స్థితిలో ఉన్నాయి. అలాగే వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్లు శుభ్రం చేయాలని, సైడ్ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## చాక్ పీస్‌పై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రం





**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ లో పనిచేస్తున్న కాచవరపు సంధ్య అనే ఉపాధ్యాయురాలు చాక్ పీస్ పై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని చిత్రీకరించారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని హ్యాపీ టీచర్స్ డే తెలియజేస్తూ తన మైక్రో ఆర్టిస్టుతో చిత్రీకరణ చేయడం జరిగింది. అద్భుతంగా చిత్రీకరణ చేయడం పట్ల ఉపాధ్యాయురాలిని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి, హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఐదు మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.4000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందికి రూ.20,200 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

## జేసీబీతో పిచ్చి చెట్ల తొలగింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని నాలుగోవ డివిజన్ యాదవ్ నగర్ కెనాల్ కట్ట సమీపంలోని భారీగా చెట్లు పెరిగి ఉండటంతో చెట్లలో నుంచి పాములు, తేళ్లు ఇండ్లలోకి వస్తుండటంతో కాలనీలో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో వెంటనే కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు భాషబోయిన శ్రీధర్ యాదవ్ కు సమాచారం ఇవ్వడంతో స్పందించి మున్సిపల్ సిబ్బందికి తెలిపి జేసీబీ సహాయంతో బుధవారం చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా 4వ డివిజన్ అధ్యక్షుడు భాషబోయిన శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డు సమస్య కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తొందరలోనే వేసే విధంగా చూస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మంథని శంకరయ్య




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగానికి చెందిన అధ్యాపకులు మంథని శంకరయ్యను అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. 2006లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని 2010లో పీహెచ్ డీ పట్టా బన్న ఐలయ్య పర్యవేక్షణలో శిఖామణి కవిత్వం-సమగ్ర పరిశీలన అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. 2008 నుంచి 2013 వరకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యూజీ అధ్యాపకుడిగా 2013 నుంచి నేటికి 10 సంవత్సరాలు పీజీ అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల కాలంలో తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఇతను దళిత కవిగా, దళిత రచయితగా, దళిత నవలాకారుడిగా ప్రసిద్ధులు, వీరి రచనలు చిగురు, తునకలందన్, దండం, నల్ల రక్తకణాలు, పత్రావళి, యుద్ధం, తపస్సు, జక్కులు, బన్న గురు శతకం మొదలైని ఉన్నారు. వీరు రాసిన దళిత నవల జక్కులకు కొలకలూరు విశ్రాంతమ్మ నగదు బహుమతితో పాటు నాలుగు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నారు. 50కి పైగా పలు జాతీయ స్థాయి, అంతర్జాతీయ పరిశోధన పత్రం సెమినార్లలో సమర్పించాడు. కవిత్వాలు, వ్యాసాలు, పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో సమర్పించారు. అధ్యాపకుడిగా, కవిగా, రచయితగా, విమర్శకుడి,గా దళిత భావాలను సమాజంపై ప్రత్యేక ప్రభావాన్ని తన రచనల ద్వారా చూపారు. ఈ సందర్భంగా వారిని రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ వి.రామచంద్రం, ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

# ప్రైవేటు చిట్ ఫండ్ సంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

## డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజల సొమ్మును చిట్టీలు, డిపాజిట్ల పేరుతో డబ్బులు వసూలు చేసుకుని వారికి ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్న ప్రైవేటు చిట్ ఫండ్ యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. హనుమకొండ కుమార్ పల్లిలో డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిట్టీలు, డిపాజిట్లు చేసుకునే సమయంలో అనేక మాయ మాటలు చెప్పి గడువు ముగిశాక చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వమంటే ఇవ్వకుండా, వారి కార్యాలయం దగ్గరికి వెళితే ఎవరూ లేకుండా తాళాలు వేసి ఉండడంతో, చాలామంది బాధితులు వెనుతిరిగి పోతున్నారు. చిట్ ఫండ్ యాజమాన్యాలు మాత్రం వాళ్ల బాధలు పట్టించుకోకుండా ప్రజల సొమ్ముతో జల్సాలులు చేస్తున్నారు. ప్రజల సొమ్మును తిరిగి ఇవ్వాలని, గతంలో సంబంధిత అధికారులు, పోలీసులు ఆదేశాలు జారీచేసిన వాటిని తుంగలోకి తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలను మోసం చేసిన ప్రైవేట్ చిట్‌ఫండ్ యజమాన్యాలపై చర్యలు తీసుకొని వారి ఆస్తులను జప్తు చేయాలని, ప్రజల సొమ్మును తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మాటూరి సతీష్, నాయకులు కోడెపాక ప్రశాంత్, జి.అఖిల్, సురేష్, రవితేజ నవీన్, శ్రావణ్ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రానికి చెందిన పున్నం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి స్థానిక యువకుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ నాయకుడు కంది కృష్ణ చైతన్య రెడ్డి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు తన వంతు సహాయంగా బాధిత కుటుంబానికి పంపించిన 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేయూ భూములను కాపాడాలి

## ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ భూములను రక్షించి కేయూ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి యూనివర్సిటీ భూములను కబ్జా చేసిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ క్యాంటీన్ దగ్గర బుధవారం ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ హాజరై మాట్లాడుతూ ఎన్నోసార్లు యూనివర్సిటీ అధికారులకు యూనివర్సిటీ భూములను కబ్జా చేసిన వారిపైన చర్యలు తీసుకొని యూనివర్సిటీ భూములను రక్షించి యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని వినతి పత్రాలు, ధర్నాలు చేసిన యూనివర్సిటీ అధికారులు స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ఇంచార్జి వీసీ స్పందించి యూనివర్సిటీ భూములను కాపాడాలని యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. సీఆర్ పీఎఫ్ బెటాలియన్ కు ఇచ్చిన భూములను బెటాలియన్ ఖాళీ చేసిన సందర్భంగా తిరిగి ఆ భూములను యూనివర్సిటీ స్వాధీనం చేసుకోవాలని, అదే విధంగా యూనివర్సిటీకి అధిక బడ్జెట్ కేటాయించి యూనివర్సిటీలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు పీజీ పాసై సర్టిఫికెట్స్ తీసుకుపోవడానికి వెళ్తే యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు ఫీజులు చెల్లించి సర్టిఫికెట్స్ తీసుకుపోవాలని చెప్పడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పై చదువులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ స్పందించి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని మంద నరేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీరాజ్, ఏబీఎస్ఎఫ్ కేయూ ఉపాధ్యక్షులు హర్షం చరణ్, అశోక్, రాజు, కిరణ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువు కట్టను, విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించాలి

## మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల ఆలేరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరదల తాకిడికి చెరువు కట్ట తెగి పంటపొలాలు, విద్యుత్ స్తంభాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాలోత్ కవిత చెరువు కట్టను సందర్శించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల నేపథ్యంలో పూర్తిగా దెబ్బతిన్న చెరువు కట్టకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని, జిల్లా అధికారులతో మాట్లాడి విజ్ఞప్తి చేశారు. త్వరితగతిన కట్టను ఏర్పాటు చేస్తే మిగిలిన కొద్దిమంది రైతుల పంటపొలాలు దెబ్బతినకుండా ఉంటాయని అధికారులతో మాట్లాడారు. వరదలతో విద్యుత్తు సరఫరా పూర్తిగా దెబ్బతిందని, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని, త్వరగా ఆ సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వరదల కారణంగా గ్రామంలో చెత్త చెదారం పేరుకుపోయిందని, పారిశుద్ధ్య కార్మికులు, వైద్య శాఖ అధికారులతో మాట్లాడి అంటూ వ్యాధులు ప్రబలకుండా చూడాలని వారికి సూచించారు. వరదల వల్ల పలువురు ఇండ్లలో నీరు చేరగా బాధితులను పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, నెల్లికుదురు మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తునందున ప్రయాణాలు చేయవద్దని, వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు జిల్లాలో లోతట్టు గ్రామాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేస్తూ, శిధిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి, సమీప బంధువుల దగ్గరికు, పునరావాస కేంద్రాల్లోకి పంపడం జరుగుతుందని తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం రానున్న 3 రోజులు అతి భారీవర్షాలు కురువనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిధిలావస్థలో ఉన్న ఇండ్లను ప్రజలు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటలు పనిచేయు విధంగా ఐటీడీఏ ఏటూరు నాగారంలో కంట్రోల్ రూమ్ సెల్ నెం.6309842395, 08717-293246 లేదా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 7109 ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ సిబ్బంది అత్యవసర సేవల్లో ఉన్నందున ఎలాంటి సెలవులు అనుమతించబడవని తెలిపారు. ప్రజలు విపత్కర పరిస్థిత్తుల్లో ఉన్నారని యంత్రాంగం అన్ని తానై పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల జిల్లాలోని అన్ని చెరువులు, వాగులు ప్రమాదకర స్థాయిలో పొంగి పొర్లుతున్నాయని, చెరువులు, వాగులు చూసేందుకు ప్రజలు వెళ్ళొద్దని సూచించారు. గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చిన్నా, పెద్ద చెరువులు, వాగులు నిండుకుని ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని, పొంగి పొర్లుతున్న చెరువులు, వాగులు, వంకలు చూసేందుకు, సెల్ఫీలు, ఫొటోల కోసం ప్రజలు వస్తుంటారని, నీటి ప్రవాహం వల్ల ప్రమాదం పొంచి ఉందని, పడిపోయే అవకాశాలున్నాయని ఎవరూ వెళ్లొద్దని ఆయన అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళొద్దని సూచించారు. అలాగే పశు వులను మేతకు బయటికి వదలొద్దని ఆయన తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముందస్తు ప్రణాళికలతో చేపట్టిన చర్యలల్లో ప్రభుత్వ యంత్రాంగపు విధులను కలెక్టర్ అభినందించారు. పూర్తిగా వర్షాలు వరదలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ఇదే పనితీరును కనబరిచాలని అన్నారు. విపత్కర పరిస్థితిల్లో ప్రజలు యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ముంపు సమస్యలపై శ్రద్ధ వహించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితులను తన దృష్టికి తేవాలని ఆదేశించారు.

# వరద బాధితులను పరామర్శించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** భారీ వర్షాలు వరదల కారణంగా దెబ్బతిన్న డోర్నకల్, సిరోలు మండలాల్లో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. కలెక్టర్ సిరోలు మండలం, దుబ్బతండ, మోదుగులగూడెం, డోర్నకల్ మండలం ములకలపల్లిలో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న, ప్రాంతాలు, ములకలపల్లిలోని (120), దుబ్బగడ్డ తండా, (45), మోదుగుగడ్డ తండా (40) గృహాలను ఇంటింటికి తిరిగి సందర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. ములకలపల్లి–తిరుమలాయ పాలెం అప్రోచ్ రోడ్డు, ములకలపల్లి – ఖమ్మం రోడ్డు, వెంటనే మరమ్మత్తులు చేయుటకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలని, గృహాల స్థితిగతులు, తెలుసుకొని నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పక్కాగా సానిటేషన్ నిర్వహించి అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటిలోని వ్యక్తులను వైద్య పరీక్షలు నిర్వహించాలని వారికి కావలసిన మందులు పంపిణీ చేయాలని, ప్రస్తుతం వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. గృహాలలో తడిసిన సర్టిఫికెట్స్, పట్టేదారు పాస్ బుక్కులు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తదితర సర్టిఫికెట్స్ కోల్పోయిన వారి వివరాలు సేకరించి చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలు, వాగులు, పశువుల ప్రాణనష్టం, పంటల నష్టం, ఆస్తి నష్టం వివరాలు సేకరించుటకు ప్రత్యేక అధికారులను నియమించి, వెంటనే సర్వే పూర్తి చేయాలని, అట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేసి వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించుటకు చర్యలు తీసుకోవాలని, సంబంధిత సిబ్బందిని ఆయన ఆదేశించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపినందున, జిల్లాలోని అధికారులు అందరూ కార్య స్థానం వదిలి వెళ్లేందుకు అనుమతి లేదని, సెలవులో ఉన్న అందరూ సిబ్బంది విధులకు హాజరై, వర్షాలు వరద బాధితులకు సహాయం అందించాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచించిన ప్రకారంగా జిల్లాలో ప్రతి మండలానికి అధికారూలు, ప్రత్యేక బృందాలను నియమించమని, వారు వరద బాధిత ప్రాంతాలలో పర్యటన చేస్తూ విధులు నిర్వహిస్తూ ప్రజలకు వైద్యం, మౌలిక వసతులు కల్పన, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్, సీరోలు, మండల ప్రత్యేక అధికారులు జడ్పీ సీఈవో నర్మదా, వెల్ఫేర్ అధికారిణి వరలక్ష్మి, ఏడీఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, తహసీల్దార్స్ కృష్ణవేణి, శారద, ఎంపీడీవో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఎన్పీడీసీఎల్ పరిధిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి


### ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 9 వరకు భారీవర్షాలు ఉంటాయని, వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16సర్కిళ్ల (ఆదిలాబాద్, నిర్మల్ మంచిర్యాల్, ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల,హనుమకొండ, భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్, వరంగల్, నిజామాబాద్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం ) సూపెరింటెండింగ్ ఇంజినీర్లు అప్రమత్తంగా ఉండాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హెడ్ క్వార్టర్ లోనే ఉంటూ ప్రతి గంటకొకసారి విద్యుత్ సరఫరా స్థితిని పరిశీలించాలన్నారు. 24/ 7 పనిచేసేటట్లు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అంతరాయాలు జరిగిన వెంటనే పరిష్కరించాలన్నారు. తగినంత సిబ్బంది ముఖ్యంగా పోల్‌లు, సామాగ్రి కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సెలవులన్ని రద్దు చేయబడ్డాయని, అత్యవసరంగా సెలవు కావాలంటే, సీఈ (హెచ్ ఆర్డీ అండ్ ట్రైనింగ్ )కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎటువంటి అవసరం ఏర్పడిన వెంటనే కార్పొరేట్ ఆఫీస్‌కు తెలియపరచాలని కోరారు. అప్రమత్తంగా ఉండి, వాతావరణ పరిస్థితులకు తగిన విధంగా స్పందించాలని కోరారు.

## నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకోవాలి

### కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల కురిసిన వర్షాల వలన ఇండ్లలోకి నీరు వచ్చి నిరాశ్రములైన కుటుంబాలను ఆదుకోవడానికి, దాతలు స్వచ్ఛంద సంఘాలు ముందుకు రావాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం ఉర్సు రంగాశాయిపేటకు సంబంధించిన అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప ఉత్తర నక్షత్ర జాతకం సందర్భంగా డీకే నగర్ లోని ప్రజలకు కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నదాన కార్యక్రమం వారి చేతుల మీదుగా ప్రారంభించారు. వర్షం వల్ల కొన్ని కుటుంబాలు తిండి లేక ఇబ్బందులు పడుతున్నారని, నిత్యావసర వస్తువులు తడిచిపోయి ఖరాబు అయినాయని, ఇటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ అన్నదాన కార్యక్రమంలో డీకే నగర్ అభివృద్ధి అధ్యక్షుడు కుండే రాజు, ఉపాధ్యక్షులు తవుటం నరసింహ, కోశాధికారి కుండే కుమార్ స్వామి, సభ్యులు దాసరి రాజు, పిట్టల సాంబరాజు, పిట్టల హరికృష్ణ, శంకర్, రావుల రవి, ఆల్లి సమ్మయ్యలు ఉన్నారు.

# ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మల్లక్కపేట సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్, ఆర్వో మినరల్ ప్లాంట్ ను పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదులు సందర్శించి విద్యార్దినులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో జనరేటర్ లేక కరెంటు పోయినప్పుడల్లా ఇబ్బంది పడుతున్నామని, భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వర్షం పడితే బురదమయవుతుందని, తరచూ పాములు వస్తున్నాయని, మినరల్ వాటర్ ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని విద్యార్థినిలు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని, విద్యార్థులకు అందిస్తున్న అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఉండే విద్యార్దినులు తల్లిదండ్రులకు దూరంగా ఉంటారు. కనుక, ఉపాధ్యాయులు, ఉద్యోగులు విద్యార్థులకు అసహ్యించుకోకుండా ప్రేమతో విద్యాబుద్ధులు నేర్పాలని హాస్టల్ నిర్వాహకులకు హితబోధ చేశారు. గురుకుల పాఠశాలకు అవసరమాకు మౌలిక సదుపాల ఏర్పాటుకు తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అవసరమైన నిధులు తీసుకొని వచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించే విషయంలో రాజీ పడవద్దని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. గురుకుల పాఠశాలాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన పిల్లల ఆహార నియమాల పట్టిక (మెను) అందించాలని అన్నారు. కళాశాల ప్రాంగణం, భోజన ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, తద్వారా విద్యార్థులను అనారోగ్య బారిన పడకుండా చూసుకోవాలని, ఉపాధ్యాయులను ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, ఇతర వంట సామాగ్రిపై నాణ్యతతో కూడిన సరకులను ఉపయోగించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వర్షాకాలంలో పాఠశాలల ఆవరణలో ఆట స్థలాలలో గుంతలు లేకుండా చూసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మ్యాణ్ ఫ్యాక్చరింగ్ తేది, నాణ్యత తప్పనిసరిగా చూసుకోవాలని, టెండర్లు ఏ వస్తువులను కోడ్ చేశారో అట్టి వస్తువులు మాత్రమే తీసుకావాలని, నాణ్యత లేని వస్తువులు తీసుకున్నట్లైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ పరిధిలోని భీమారం నక్షత్ర కాలనీ, బాలానగర్ కాలనీలో నీట మునిగిన పలు ప్రాంతాలను బుధవారం అధికారులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు కాలనీలోని ప్రతి వాడవాడన తిరుగుతూ సమస్యలను వింటూ గత ప్రభుత్వం స్మార్ట్ సిటీ ఫండ్స్ వినియోగించుకోక తిరిగి వెళ్లిపోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు వెనక్కి తీసుకురావడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. స్మార్ట్ సిటీ ఫండ్స్ నుంచి 55వ డివిజన్ కు సుమారు రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని కమిషనర్ ను అడుగుతానని తెలిపారు. అలాగే, సత్వరమే తన సీడీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు ఇచ్చి సీసీ రోడ్, డ్రైనేజీ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అలాగే కాలనీ ప్రజలు ఎవరు సీజనల్ వ్యాధులు రాకుండా మున్సిపల్ సిబ్బంది, ఆయిల్ బాల్స్ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని, మీరు కూడా జాగ్రత్తగా ఉండి మీ ఆరోగ్యాలను వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర రావు, స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, డివిజన్ నాయకులు మార్కరాజు (డైని), రణధీర్, కాలనీ అధ్యక్షుడు సారంగపాణి, కాల్ మీ సొసైటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని పెద్ద తండా, ధూప తండా గ్రామాలలో భారీ వర్షాలకు పెద్ద ఎత్తున మొక్కజొన్న, పత్తి చేలు దెబ్బతిన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మొక్కజొన్న చెలు నేలకొరిగాయి. పెద్ద తండాకు చెందిన భూక్య మోహన్, లాక్య, రాజు, లక్ష్మణ్, రవి, బాలు, లూనావత్ నర్సింహ, దయాకర్ యాకూబ్, రవి, యాకూబ్, రవిలకు సంబంధించిన మొక్కజొన్న 40 ఎకరాలు, పత్తి 50 ఎకరాలలో పంట మొత్తం తుడుచుపెట్టుకొని పోయింది. పెట్టుబడి కోసం పెద్ద మొత్తంలో అప్పులు చేసి వ్యవసాయం చేస్తే భారీ వర్షాలకు పంట మొత్తం తుడుచుపెట్టుకొని పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

## ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగానికి రిటైర్డ్ ప్రొఫెసర్ రామేశ్వరం విరాళం




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం ప్రభుత్వ పాలనా విభాగం అభివృద్ధికి ఇరవై వేల రూపాయలను విరాళంగా బుధవారం విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం మాట్లాడుతూ విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విభాగం పటిష్టతకు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, ర్యాంపుల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు, పరిశోధక విద్యార్థులకు విస్తృత ఉపన్యాసాలు, పచ్చదనం పరిశుభ్రత మొదలగు కార్యక్రమాల నిర్వహణ ద్వారా విభాగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విభాగం ఉన్నతికి తన వంతు సహాయంగా ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తున్నానని తెలియజేశారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరాన్ని అభినందించారు. అలాగే విభాగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలనా సీనియర్ ప్రొఫెసర్, చైర్మన్ బోర్డు అఫ్ స్టడీస్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, విభాగం అధ్యాపకులు, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ మోహన్ పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.




# విడుదల వాయిదా

దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా'జనక అయితే గనక' విడుదల వాయిదా పడింది.. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. అంబాజీపేట మ్యారేజ్ బ్యూరో, ప్రసన్నవదనం వంటి వరుస హిట్ చిత్రాల తర్వాత సుహాస్ హీరోగా నటించగా సంకీర్తన కథానాయికగా చేసింది. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు. ఇటీవల విడుదల చేసిన సినిమా ట్రైలర్ మంచి ఆదరణను కూడా దక్కించుకుంది. అయితే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. ఈక్రమంలో సెప్టెంబర్ 7న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు విడుదల తేదీని కూడా ప్రకటించి ప్రమోషన్ కార్యక్రమాలు సైతం ప్రారంభించారు. ఇదిలావుండగా ఏపీ, తెంగాణ రాష్ట్రాల్లో తుఫాన్ వల్ల వరద భీభత్సం జరగడం, చాలామంది చనిపోవడం, ఇండ్లు మునగడం, తదితర సమస్యలు తలెత్తాయి.



# ఆ విషయం మాత్రం అడక్కండి:

## ఆండ్రియా జెర్మయ్య

మలయాళ చిత్రపరిశ్రమలో అవకాశాల పేరుతో 'అడ్జెస్ట్‌మెంట్'పై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై తనను ప్రశ్నించవద్దంటూ సింగర్, హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య స్పష్టంచేశారు. తిరువాన్మియూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె పాల్గొంది. ఈ సందర్భంగా ఆమెను మీడియా జస్టిస్ హేమ కమిషన్‌పై ప్రశ్నలు సంధించింది. దీనికి ఆండ్రియా జెర్మయ్య సమాధానమిస్తూ, చిత్రపరిశ్రమలో మహిళల లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై నో కామెంట్స్, ఈ అంశంలో ఎలాంటి ప్రశ్నలు అడగొద్దు' అంటూ కోరారు. నిజానికి ప్రతి అంశంలో ఎంతో బోల్డ్‌గా స్పందించే నటి ఆండ్రియా.. జస్టిస్ హేమ కమిషన్‌పై మాట్లాడేందుకు నిరాకరించడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

# సినీ తారల విరాళాలు

## అత్యధికంగా రెండుకోట్లు ప్రకటించిన ప్రభాస్





రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదల నేపథ్యంలో తెలుగు సినీ పరశ్రమ నుంచి విరాళాలు వెల్లువెత్తు తున్నాయి. జూ.ఎన్టీఆర్‌తో ప్రారంభమైన ఈ సాయం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మంగళవారం రోజున జూ. ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, విశ్వక్ సేన్, సిద్దు జొన్నలగడ్డ, కథానాయిక అనన్య నాగళ్ల, యాంకర్ స్రవంతి, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, వంశీ, ఆయ్ మూవీ టీం తమవంతు సాయంగా ప్రకటించిన ఇషయం తెలిసిందే. తాజాగా బుధవారం మెగాస్టార్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెరో రూ.50 లక్షల సాయం ప్రకటించగా, అదేబాటలో అల్లు అర్జున్ కూడా తనవంతుగా రెండు రాష్ట్రాలకు రూ.50 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. ఇక పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ కోటి చొప్పున రెండు కోట్ల విరాళం ప్రకటించి తన సేవాగుణాన్ని మరో సారి చాటుకున్నాడు. అదే విధంగా కమెడియన్ అలీ ఆంధ్రప్రదేశ్‌కు రూ.3 లక్షలు, తెలంగాణకు రూ.3 లక్షల చొప్పున రూ.6లక్షల విరాళం ప్రకటించారు. కోట శ్రీనివాసరావు లక్ష సాయం ప్రకటించారు.




# దేవర నుంచి కొత్త పోస్టర్ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తుంది చిత్రబృందం. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ఫియర్ సాంగ్‌తో పాటు సెకండ్ సింగిల్ చుట్టమల్లే పాటలను విడుదల చేయగా.. ఈ రెండు పాటలు యూట్యూబ్‌లో దూసుకుపోతున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ 'దావుడి' సాంగ్‌ను ఈరోజు సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

బుధవారం 04, సెప్టెంబర్ 2024
www.warangalvoice.net



# రైళ్ల రాకపోకలు షురూ..

## రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ పూర్తిగా కొట్టుకు పోయి నాలుగు రోజులపాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రైల్వే అధికారులు, సిబ్బంది హుటాహుటిన స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. బుధవారం ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ కు మరమ్మత్తు పనులు పూర్తి చేసి డౌన్ లైన్ ( విజయవాడ వైపు వెల్లే ) సంఘమిత్ర  ఎక్స్ ప్రెస్ ను పంపించి ట్రయల్ రన్ ను నిర్వహించారు. నిన్న తాళ్ల లపూసలపల్లి....ఈ రోజు ఇంటికన్నె వద్ద రైల్వే శాఖ నిర్వహించిన ట్రయల్ రన్ లు విజయవంతం కావడంతో రైల్వే సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో వరద విలయ తాండవం సృష్టించి మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె రైల్వే స్టేషన్ శివారులో 418 కిలో మీటరు మైలు రాయి వద్ద 42 మీటర్ల పొడవున రైలు పట్టాల కింద కంకర కొట్టుకు పోయి పట్టాలు గాలిలో తెలియాడాయి. వెంటనే రైల్వే శాఖ సిబ్బంది అప్రమత్తం కావడంతో భారీ ప్రమాదం తప్పింది. రైల్వే శాఖ సిబ్బంది నాలుగు రోజులుగా రైలు పట్టాల మరమ్మతు పనులను 8 ఎక్స్ వేటర్ లు, భారీ జేసీబీ లు ఇతర యంత్రాలతో  వేయి మంది సిబ్బంది రాత్రి... పగలు తేడా లేకుండా వర్షంలో ట్రాక్ మరమ్మతుల పనులు పూర్తి చేసి ట్రాయల్ రన్ నిర్వహించారు. ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్స్ విభాగం విద్యుత్ సరఫరా లైన్ పనులు, కమ్యూనికేషన్స్ తదితర పనులను యుద్ధ  ప్రాతిపదికన పూర్తి చేశారు.

మరి కొన్ని గంటల్లో రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఉత్తర...దక్షిణాలను కలిపే రైలు మార్గం  కావడంతో రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆగస్టు 31 వ తేదీ అర్ధరాత్రి భారీ వర్షానికి వరద ప్రవాహం పెరగడంతో ట్రాక్ మెన్లు అప్రమత్తమై కేసముద్రం రైల్వేలో రెండు సంగమిత్ర రైళ్లు , మహబూబాబాద్ రైల్వే మచిలీపట్నం, సింహపురి రైళ్లను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.








# నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ తహసీల్దార్ సంతకాన్ని పొర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్లను విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టైంది. వరంగల్ ఎమ్మార్వో ఇక్బాల్ మట్వాడ పోలీస్ స్టేషన్ లో చేసిన ఫిర్యాదు చేసిన విచరణలో నమమలేని నిజాలు తెలిసాయి. డబ్బులు ఇస్తే ఏ సర్టిఫికెట్ కావాలంటే దానిని క్షణాల్లో ఇస్తూ అందిన కాడికి దండుకున్నట్లు ఏసీపీ నందిరాం నాయక్ వెల్లడించారు. బుధవారం మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. నగరానికి చెందిన హస్తం సతీష్ తాను నిర్వహించే వడ్డీ వ్యాపార లైసెన్స్ రెన్యూవల్ కోసం వరంగల్ ఎమ్మార్వోను ఆశ్రయించారు. తన దరఖాస్తుతో పాటు పాట లైసెన్స్ కాపీని కూడా జత చేయడంతో వాటిని పరిశీలించిన తహసీల్దార్ ఇక్బాల్ అది తన సంతకం కాదని గుర్తించారు. సదరు లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా హెూల్డ్ లో ఉంచి మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి విచారణలో భాగంగా నేరస్థుడైన పస్తం సతీష్ ను అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే సదరు హస్తం సతీష్ కొంతకాలంగా వడ్డీ వ్యాపారం చేస్తూ తన వడ్డీ వ్యాపారానికి సంబంధించిన లైసెన్సు రెన్యూవల్ గురించి జూలూరి చక్రపాణిని ఆశ్రయించినట్లు వెల్లడించారు. అతను తహసీల్దార్‌తో సంబంధం లేకుండా సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పి వరంగల్ కొత్తవాడకు చెందిన గోవిందు సతీష్ కుమార్ వద్దకు తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ విధంగా గోవిందు సతీష్ కుమార్ దగ్గరికి గత కొన్ని సంవత్సరాలుగా జూలూరు చక్రపాణి, మాన్యం సిద్ధయ్యలు కలిసి ఎవరినైనా తన దగ్గరికి తీసుకొని వస్తే, వారికి నకిలీ సర్టిఫికెట్ కావాలి అని అంటే తయారు చేసి ఇస్తున్నారని ఏసీపీ వెల్లడించారు. గతంలో గోవిందు సతీష్ మండి బజారుకు చెందిన కాజా మహమ్మద్ అజారుద్దీన్ అనే వ్యక్తికి కాజీపేట కు చెందిన సయ్యద్ సాబీర్ అనే వ్యక్తికి, మాకుల దామోదర్ అనే వ్యక్తికి ఎమ్మార్వో సంతకాలను ఫోర్జరీ చేసి ఫ్యామిలీ సర్టిఫికెట్లను ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఎనమాములకు చెందిన కాసెట్టి కమలాకర్ కు, ఎనుమాముల వద్దగల సిరంగి రమేష్ కు ప్రభుత్వం వాళ్ళు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల పట్టా పోవడంతో దానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాను ఫోర్జరీ చేసి తయారు చేయించి ఇవ్వడంతోపాటు ఇంకా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులకు కూడా గత కొన్ని సంవత్సరములుగా గోవిందు సతీష్ కుమార్ ఫోర్జరీ చేసిన సర్టిఫికెట్లను ఎక్కువ డబ్బులకు అమ్ముకుంటున్నాడని వెల్లడించారు. ఈ క్రమంలో ఎమ్మార్వో, వరంగల్  పస్తం సతీష్ పై కేసు నమోదు చేయగా, గోవిందుల సతీష్ కుమార్ దగ్గర సర్టిఫికెట్లు పొందిన పై వారందరూ కలిసి కేసు విషయమై మాట్లాడుకొనుటకు గోవిందు సతీష్ కుమార్ ఇంటి వద్దకు బుధవారం ఉదయం రాగా , పోలీసులు పట్టుకొని వారి నుంచి కాజీపేట తాసిల్దార్ పేరు మీద ఉన్న రబ్బర్ స్టాంపు ముద్ర,  హనుమకొండ డిస్టిక్ అనే రబ్బర్ స్టాంప్ ముద్ర, వరంగల్ ఎమ్మార్వో కు సంబంధించిన రబ్బర్ స్టాంప్ ముద్ర, తాసిల్దార్ ఆఫీస్ కు సంబంధించిన రౌండ్ సీల్ లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సదరు గోవిందు సతీష్ ఇట్టి ఫోర్జరీ డాక్యుమెంట్లను తయారు చేయడానికి టైలర్ స్ట్రీట్ కు చెందిన సముద్రాల కిరణ్ కుమార్ అనే వ్యక్తి దగ్గర గత 15, 16 సంవత్సరముల క్రితం రబ్బరు స్టాంపులు తయారు చేయించి వాటిని ఉపయోగించి ఫోర్జరీ డాక్యుమెంట్లను తయారు చేస్తున్నాడని నందిరాం నాయక్ తెలిపారు. ఆ తరువాత నకిలీ రబ్బరు స్టాంపులు తయారు చేసి గోవిందు సతీష్ కుమార్ కు ఇచ్చిన సముద్రాల కిరణ్ కుమార్ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. మొత్తంగా ఇట్టి నేరం చేయడంలో భాగస్వాములైన ఎనిమిది మంది నేరస్తులు హస్తం సతీష్, జూలూరి చక్రపాణి, గోవిందు సతీష్, మహమ్మద్ అజారుద్దీన్, సయ్యద్ సాబీర్,  మాకుల దామోదర్, కాసెట్టి కమలాకర్, సముద్రాల కిరణ్ కుమార్ లను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. మాన్యం సిద్దయ్య మీద విచారణ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్ మట్టెవాడ సీఐ తుమ్మ గోపి ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# నేలకొరిగిన మావోయిస్టు అగ్రనేత..

## ఎన్ కౌంటర్‌లో మాచర్ల ఏసోబు మృతి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ తొలితరం నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు, కేంద్ర మిలిటరీ ఇంచార్జి, మహారాష్ట్ర చత్తీస్ ఘడ్ బార్డర్ ఇంచార్జి మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ మంగళవారం జరిగిన ఎన్ కౌంటర్ లో నేలకొరిగారు. సెప్టెంబర్ మూడున చత్తీస్ గడ్ ఎన్కౌంటర్లో పదిమంది మావోయిస్టులు మరణించగా అందులో కామ్రేడ్ జగన్ అలియాస్ యేసొబు కూడా ఉన్నట్లు దంతేవాడ ఎస్పీ ప్రకటించారు. భార్య ముగ్గురు పిల్లలు కలిగిన కామ్రేడ్ జగన్ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల కోసం కమ్యూనిజం కోసం 35 సంవత్సరాలకు పైగా విప్లవ జీవితం కొనసాగించాడు. కామ్రేడ్ జగన్ వరంగల్ దగ్గర ఉన్న టేకుమెట్ల గ్రామంలో దళిత కులంలో పుట్టి క్రైస్తవ మత బోధకుడిగా పని చేసే క్రమంలో ఆ ప్రాంతంలో జరుగుతున్న భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాల చేత ఉత్తేజితుడై భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహించేవాడు. అమరుడు కడారి రాములు, రవి నాయకత్వంలో 1990 ప్రాంతంలో అన్న సాగర్ దళంలో రిక్రూట్ అయ్యాడు. దళంలోకి రావడానికి ముందు ఆ ఏరియాలోని రైతు కూలీ సంఘం నాయకుడిగా ప్రజల అభిమాన నాయకుడిగా విశేష ఆదరణ పొందారు. అన్నసాగర్ దళంలో రిక్రూట్ అయిన కొద్ది కాలంలోనే ఆర్గనైజర్ గా, కమాండర్ గా నియమించబడ్డాడు. 1995 కాలంలో జిల్లా కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా కమిటీ మెంబర్ గా ఎన్నికయ్యాడు. 2001 లో తెలంగాణ రాష్ట్ర కమిటీ పరిధిలో ప్రెస్, రక్షణ వ్యవహారాలు నిర్వహించడానికి ఏర్పడిన ప్లాటున్ కమాండర్ గా నియమింపబడ్డారు. 2004లో కేంద్ర కమిటీ రక్షణ కర్తవ్యాలను నిర్వహించటానికి ఏర్పడిన కంపెనీకి కమాండర్ గా, 2012లో జనతన సర్కార్ చేత నిర్వహించబడే వ్యవసాయ అభివృద్ధి కమిటీ నాయకుడుగా అబూజ్ మాడ్ ప్రాంతంలో పనిచేశాడు. కామ్రేడ్ జగన్ తాను పనిచేసిన రైతాంగంలో అడవి ప్రాంతంలోని ఆదివాసి ప్రజలతో  ఐక్యం అయి ప్రజాభిమానాన్ని చూరగొన్న గొప్ప నాయకుడు. దళంలో ప్లాటున్ లో కంపెనీలో కమాండర్ గా జిల్లా కమిటీ మెంబర్ గా పార్టీ బాధ్యతలను నిర్వర్తిస్తూ పార్టీ కేడర్ అభిమానాన్ని పొందిన గొప్ప నాయకుడు కామ్రేడ్ జగన్.

# ఓటర్ల జాబితా సరి చూసుకోవాలి

## సహాయ ఎన్నికల అధికారి పెద్ది ఆంజనేయులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ అనుసరించి రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 6 వ తేదీన గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని సహాయ ఎన్నికల అధికారి పెద్ది ఆంజనేయులు పెద్ది ఆంజనేయులు తెలిపారు. అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 7 వ తేదీ నుంచి 13 వ తేదీ తేదీ వరకు పంచాయతీ కార్యదర్శి ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారికి సమర్పించాలన్నారు. 19 వ తేదీ వరకు వాటిని పరిశీలించి పరిష్కరించి 21వ తేదీన ఫైనల్ ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా విషయంలో మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులతో తేదీ అక్టోబర్ 10న అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com